కథ

# రసగంగ

—వాత్స్యాయన

"ఏదైన ఓ మంచి కథ చెప్పు" అన్నది కిన్నెర విద్యాధరుణ్ణి అల్లుకుపోతూ.

"ఏం చెప్పను?"

"ఏదైన! ఇలాంటి సమయాల్లో ఉత్సాహాన్ని కలిగించే కథ"

"సరే విను!"

"చాలాకాలం క్రిందట స్త్రీ, పురుషులు కలుసుకునే ముందు 'రాగ రాగిణీ వ్రతం' అని ఒక వ్రతం చెయ్యాల్సి వుండేదట. ఆ వ్రతం అనుష్ఠించిన వాళ్లని ఆ దేవి కరుణించి రసగంగని విడుదల చేసేదట. దానిలో పునీతమైన వారికే అనంతర కార్యక్రమాలకి అర్హత వుండేదట. వింటున్నావా?"

"వింటున్నా! ఆ రాగిణీ దేవి 'కుంతలోద్యానం'లో 'మానసగ్రంధి'లో ఉద్భవిస్తుందట ఈ రసగంగ"

"కుంతలోద్యానంలో మానసగ్రంధిలోనా?" అంది కిన్నెర. సాలోచనగా



తన మృదువైన కురుల్ని నిమురుకుంటూ చేతిని బ్రహ్మరంధ్రం మీదకు పోనిస్తూ.

"అవును! భక్తుడు పూజించే కొద్దీ ఆ గంగ పెల్లుబుకుతూ. 'గంధ ఫలి వారధి' చేరుతుందట"

"ఏమన్నావ్? గంధ ఫలివారధా?" అంది కిన్నెర.

"అవును!" అన్నాడు విద్యాధరుడు సంపంగి పువ్వు లాంటి ఆమె ముక్కును చూపుడువేలితో రాస్తూ,

"ఇలా అడుగడుక్కీ అడ్డం రాకు కథని కథగానే వినాలి గాని ఏవేవో వూహించుకోగూడదు,"

"సరే! సరే! చెప్పు!" అంది కిన్నెర అర్థమయినట్లు, విద్యాధరుడు స్పృశించిన తన నాసికని ఆప్యాయంగా నిమురుకుంటూ.

"అక్కడ ఆ నది రెండు పాయలుగా చీలుతుందట ఒక పాయ 'గండ వితర్ది'ని సేచనం చేస్తుండగా, రెండో పాయ 'హసన బింబిక' మీది నించి జారి, 'గళాఖాతంలో పడి పోతుందట'"

"అయ్యో! పాపం!" అంది కిన్నెర చెమరించిన తమ చెంపల్నీ, అదురుతోన్న తన పెదవుల్నీ తడుముకుంటూ.

"అయితే, గళాఖాతానికి కొంచెం ఎగువన 'క్షీర శృంగ పర్వతం' వుండడం చేత దానిని అనుకుని ఉబికి ఉబికి చివరికి ఆ పర్వత శృంగాల మధ్య లోయలో పడి ప్రయాణిస్తుందట"

"ఆగు! ఆగు! నువ్వు అన్నీ అబద్ధాలు చెబుతున్నావ్! గళాఖాతంలో పడిన గంగ ఎంత క్షీర పర్వతాలు వుంటే మాత్రం పైకి ఎలా ఉబుకుతుంది? మిగతా రెండు పక్కలా అడ్డుకట్టలు వెయ్యందే!" అంది కిన్నెర.

'ఓ! అవును చెప్పడం మరిచాను. గళాఖాతానికి అటూ యిటూ 'స్కంధ స్రోతస్సులు' అని రెండు లోయలు వున్నాయి. అయితే రసగంగ అటు జారిపోకుండా మానసగ్రంధి ఆ లోయలో అటూ యిటూ రెండు 'ప్రియబాహు తటాల్ని' సృష్టిస్తుంది!

సందేహం తీరినట్లేనా? అన్నాడు విద్యాధరుడు.

కిన్నెర నవ్వుతూ, "ఆ గంగని నువ్వు చేర్చదల్చుకున్న చోటికి చేర్చేదాకా ఏం కావాలంటే అవి పుట్టుకొస్తూ వుంటాయి. కానీ, చెప్పు! చెప్పు!" అంది కిన్నెర.

"ఇంక అడ్డు తగలనంటే చెబుతాను"

"అలాగేలే, చెప్పు" అంది కిన్నెర.

"ఊ! ఎక్కడి దాకా వచ్చాం? అలా క్షీరశృంగాల మధ్యనించి ప్రవహించిన రసగంగ అక్కడి మైదాన ప్రదేశంలో బాగా విస్తరించి ఆ మైదానం నడి బొడ్డున గల గుండంలో సుళ్లు తిరిగి, చివరికి కన్యాకుమారీ పీఠం చేరుకుంటుంది"

"ఊ!" తరువాత?"

"ఆ పీఠానికి ఒకవైపు తూర్పు కనుమలూ, మరొకవైపు పడమటి కనుమలూ వుంటాయి. ఇక్కడే సాధకుడికి ఏకాగ్రత అవసరం. ఆ రసగంగని ఆ కనుమల సంగమ స్థానంలో వున్న పంచబాణ నాదంలోకి ఆకర్షించాడా, ఇక అతని తపస్సు ఫలించినట్లే! ఈ ఘట్టంలోనే సాధకులు రకరకాల పద్ధతుల్ని అనుసరిస్తారు.

కొంతమంది 'వామాచార కరన్యాసం' చేస్తారు.

"అంటే?" అంది కిన్నెర.

"చేతి వేళ్లని ఉపయోగించి చేసే ఒకానొక సాధన"

"ఓహో!"

"మరికొంత మంది 'కామ ఖేచరీ ముద్ర' పడతారు, అంటే అంది కిన్నెర మళ్లీ

"అంటే అది నాలుకతో చేసే ఒక తంత్ర ప్రక్రియ, అబ్బ! నీకు అన్నీ సందేహాలే! కాని సాధకుడి తపోసాఫల్యం మాత్రం మూలాంగన్యాసంతోటే! ఈ అంగన్యాసం చేసే టప్పుడు సాధకుడు సర్వ శక్తుల్నీ మోహరించి చేస్తాడు. ఆ సవుయానికి పంచబాణ నాదంలోకి రసగంగ చేరుకుందా... ఇక అతనికి... ఆనందోబ్రహ్మ" అన్నాడు విద్యాధరుడు.

"కథ బాగుంది గాని నేనో మాట చెప్పనా?" అంది కిన్నెర.

"ఏవిటి? ఆ సురగంగ సాక్షాత్కారానికి ఇంత ప్రయాస లేని ఇంకో సులభమార్గం గూడా వుంది"

"అలాగా, ఏవిటి చెప్పు!"

"మరేం లేదు! ఆ సాధన లేవీ చెయ్యకపోయినా, ఇలాంటి కథొకటి వినిపిస్తే ఆ సురగంగ తక్షణమే సాక్షాత్కారం కాదూ?"

"అవుతుంది అయింది. అంటూ సాగిపోయాడు విద్యాధరుడు.

●